# సిఆర్‌పిఎఫ్ డిజిగా జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్ నియామకం



**న్యూఢిల్లీ :** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా అసోం పోలీస్ చీఫ్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది మంత్రిత్వశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన సింగ్ అసోం–మేఘాలయ కేడర్‌కు చెందిన వారు. సిఆర్‌పిఎఫ్ డిజిగా సింగ్ నియామకాన్ని కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదించింది. దీంతో సింగ్ ఈనెల 18వ తేదీ నుంచి నవంబరు 30, 2027 వరకు పదవిలో కొనసాగనున్నారు. డిసెంబర్ 31, 2024న అనిష్ దయాల్ సింగ్ పదవీ విరమణ చేసిన తర్వాత సీనియర్ ఐపిఎస్ అధికారి వితుల్ కుమార్ దళానికి అధికారిక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# ‘రైడ్‌రాజ్’..‘టాక్స్ టెర్రరిజం’ రహిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి

## బిజెపి నేతృత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శనాస్త్రాలు



**న్యూఢిల్లీ :** బిజెపి నేతృత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వంపై ఆదివారం కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించింది. మోదీ ప్రభుత్వ తిరోగమన విధానాలు భారతదేశంలోని పెట్టుబడిదారులలో విశ్వాసాన్ని విచ్ఛిన్నం చేసిందని ధ్వజమెత్తింది. ఆయన ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సులువైన వ్యాపార నిర్వహణను అసౌకర్యంగా మార్చాయని ఆరోపించింది. రానున్న ఎన్నికలలో ‘రైడ్ రాజ్’ను, ‘టాక్స్ టెర్రరిజాన్ని’ నిర్మూలించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. భారతీయ తయారీ రంగంలో ఉద్యోగాలను రక్షించేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వేతనాలు, కొనుగోలు శక్తిని పెంచడానికి నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలని కోరింది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (ఇన్‌ఛార్జి, కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ మాట్లాడుతూ భారతదేశబంలో సులభతరమైన వ్యాపారం మెరుగుపరచుకోవాలని మోదీ ప్రభుత్వం గత కొంతకాలంగా తన ఆకాంక్షను ప్రకటిస్తున్నదని, అయితే గత దశాబ్దకాలంలో ప్రైవేట్ పెట్టుబడులు తగ్గిపోవడం గమనార్హం అన్నారు.ఇది రికార్డు స్థాయికి పడిపోయిందన్నారు. కనిష్టస్థాయిలను నమోదు చేయడం భారతదేశం నుంచి విదేశీతీరాలకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన వ్యాపారవేత్తలనుంచి ఉపశమనం పొందడం జరుగుతోంది’. జిఎస్‌టి, ఆదాయపు పన్ను రెండింటినీ కవర్‌చేసే ఒక బైజాంటైన్ (ఇస్తాంబుల్) శిక్షాత్మక, ఏకపక్ష పన్ను విధానం ఇప్పుడు భారతదేశ శ్రేయస్సుకు గొప్ప ముప్పుగా పరిణమించింది. అంతేకాకుండా వ్యాపారనిర్వహణను అసౌకర్యంగా మార్చడానికి దోహదం చేసింది’ అని జైరామ్ రమేష్ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.పెట్టుబడిలో అతిపెద్దభాగమైన ప్రైవేట్ డొమెస్టిక్ పెట్టుబడి 2014నుండి బలహీనంగా ఉన్నదని, మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఇది స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి) పరిధిలో2530 శాతం మాత్రమేనని జైరామ్ రమేష్ అన్నారు. గత దశాబ్ద కాలంలో ఇది 2025శాతం జిడిపి శ్రేణికి కుప్పకూలింది. పెట్టుబడులు మందగించిన నేపథ్యంలో అధిక నికరవిలువ వ్యక్తులు పెద్దయెత్తున వలసవెళ్లారు. గత దశాబ్దంలో దేశం నుంచి17.5లక్షల మందికి పైగా భారతీయులు ఇతర దేశాలకు తరలివెళ్లి అక్కడి పౌరసత్వం పొందడం శోచనీయమన్నారు. 2020నుంచి 2025వరకు 21,300 డాలర్‌మిలియనీర్లు భారతదేశాన్ని విడిచివెళ్లిపోయారని జైరామ్ రమేష్ మోదీ ప్రభుత్వాన్ని నిందించారు. ఇదంతా మూడు కారణాల వల్ల సంభవిస్తోంది. మొదటిది క్లిష్టతరమైన జిఎస్‌టి కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన సెస్సులు సహా మంచి, సరళమైన ట్యాక్స్ రేట్ల పేరుతో 100 వరకు ఉన్నటువంటి వివిధ రకాల ట్యాక్స్ రేట్లు వల్ల ఇదంతా జరుగుతోందన్నారు. రేట్లు అనేక రెట్లు పెరిగిన కారణంగా 2023 ఆర్థిక సంవత్సరంలతో రూ.1.01లక్షల కోట్లు ఉన్న జిఎస్‌టి ఎగవేత కాస్తా రూ.2.01లక్షల కోట్ల మేరకు జిఎస్‌టి ఎగవేత ప్రమాదకరస్థాయికి మారి గందరగోళం నెలకొందని జైరామ్ రమేష్ తెలియజేశారు. మోసపూరిత సంస్థలు 18,000 బయటపడ్డాయని, ఇంకా చాలా వరకు గుర్తించబడలేదని ఆయన చెప్పారు. రెండవది, దీనికి విరుద్ధంగా వాదనలు ఉన్నప్పటికీ చైనీస్ దిగుమతిలో 20232024లో భారతదేశం రికార్డు స్థాయిలో 85బిలియన్ డాలర్ల వాణిజ్యలోటుతో నిరంతరం కొనసాగుతోందన్నారు. ఇది భారతీయ తయారీ రంగాన్ని ముఖ్యంగా కార్మిక ప్రోత్సాహక రంగాలను దెబ్బతీసిందని రమేష్ చెప్పారు. మూడవ అంశాన్ని ప్రస్తావిస్తూ బలహీనమైన వినియోగం, స్తబ్దుగా ఉన్న వేతనాలు వ్యక్తిగతంగా ఉచితంగా అందుబాటులో ఉన్నప్పటికీ భారతదేశంలతో వినియోగ వృద్ధిని తగ్గించివేశాయన్నారు. తన సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో జైరామ్ రమేష్ పెట్టిన పోస్ట్‌లో ఆయన మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తిరోగమన విధానాలను ఎండగట్టారు. 202526సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం నేటి (జనవరి 19)నుంచి 13రోజులలో సమర్పించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నరేంద్రమోదీ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించింది.

# పోలింగ్ ప్రక్రియలో ఇసి చిత్తశుద్ధి,నిబద్ధత

## మన్ కీ బాత్ లో ఎన్నికల సంఘానికి ప్రధాని మోదీ అభినందనలు



**న్యూఢిల్లీ:** న్యాయబద్ధంగా పోలింగ్ ప్రక్రియ నడిపించేందుకు ఎన్నికల సంఘం చిత్తశుద్ధి నిబద్ధత ప్రదర్శిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. ప్రజల అధికారాన్ని పటిష్టం చేసేందుకు సాంకేతిక పరిజ్ఞాన శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకుంటున్నందుకు, అదేవిధంగా న్యాయబద్ధమైన పోలింగ్ ప్రక్రియలో చిత్తశుద్ధి–నిబద్ధత చూపిస్తున్నందుకు ఎన్నికల సంఘంపై మోదీ ప్రశంసలు కురిపించారు. ఆకాశవాణి, దూరదర్శన్ ఆదివారం ఉదయం ప్రసారం చేసిన నరేంద్రమోదీ “మన్ కీ బాత్” నెలవారీ కార్యక్రమంలో ఎన్నికల సంఘాన్ని ఆయన ప్రశంసల్లో ముంచెత్తారు. కొత్త సంవత్సరంలో ప్రసారమైన మోదీ మొదటి “మన్ కీ బాత్” కార్యక్రమం ఇదే. 1961 నాటి ఎన్నికల నిబంధనలకు చేసిన సవరణలపై ప్రతిపక్షాలు ఇటీవల తరచు విమర్శలు చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విశ్వసనీయతను, ఎన్నికల సంఘం చిత్తశుద్ధిని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల సంఘం బిజెపి అనుకూలంగా వివక్ష చూపిస్తోందని ప్రతిపక్షాలు తరచు విమర్శలు చేస్తున్నాయి. ఈ పూర్వరంగంలో మరో ఆరు రోజుల్లో (జనవరి 25వ తేదీన) రానున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్ కీ బాత్ ప్రసంగంలో ఎన్నికల సంఘం పనితీరును మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. ఈ ప్రశంసల ద్వారా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పరోక్షంగా ఆయన సమర్థించారు.

జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉందనీ, ఆ రోజున భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిందనీ మోదీ పేర్కొన్నారు. ఎన్నికల సంఘానికి అంతకు సమానంగా ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యానికీ భారత రాజ్యాంగ రూపకర్తలు ఎంతో ప్రముఖస్థానాన్ని ఇచ్చారని మోదీ అన్నారు. “మొదటిసారి 1951–52 లో సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు దేశంలో ప్రజాస్వామ్యం అసలు బతికిబట్టకడుతుందా? అని కొంత మంది సందేహం వ్యక్తం చేశారు, కానీ ఈ భయాలన్నీ అసత్యాలని మన ప్రజాస్వామ్యం రుజువు చేసింది, వీటన్నింటి తర్వాత భారతదేశం ప్రజాస్వామ్యానికి మాతృమూర్తిగా మారింది” అని మోదీ అన్నారు. “గడచిన దశాబ్దాలలో దేశ ప్రజాస్వామ్యం పటిష్టవంతమైంది, ప్రగతి సాధించింది, అందువల్ల ఎన్నికల సంఘానికి నేను నా కృజ్ఞతలు తెలియజేయదలచుకున్నాను, ఎప్పటికప్పుడు మన ఎన్నికల ప్రక్రియను ఎన్నికల సంఘం ఆధునీకరిస్తున్నది, న్యాయబద్ధంగా అరమరికలు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు కేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని తన చిత్తశుద్ధిని ప్రదర్శిస్తున్నది” అన్నారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యం ఉందనీ, ఈ ఏడాది 75వ గణతంత్ర దినోత్సవాన్ని దేశం చేసుకుంటున్నదనీ, రాజ్యాంగ అసెంబ్లీలో సభ్యులుగా పనిచేసిన ప్రముఖులందరికీ తాను వందనాలు చెబుతున్నాననీ అన్నారు. అంతరిక్ష రంగంలో ఈ ఏడాది భారత్ గొప్ప విజయాలు సాధిస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యత పెరిగిందన్నారు. అంతరిక్షంలో మొక్కలు మొలిపించేందుకు, ఆకులు విరబూయించేందుకు మన శాస్త్రవేత్తలు విజయవంతమైన కృషి చేశారన్నారు. భవిష్యత్తులో గగన్‌యాన్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కులమతాలకు అతీతంగా ప్రయాగ్ రాజ్ కుంభమేళాలో ప్రజలు పాల్గొంటున్నారన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ కుంభమేళా ప్రతి భారతీయుడికీ గర్వకారణమని అన్నారు. ఈనెల 23న సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయనకు స్మరించుకున్నారు.

# పడవ మునక ముగ్గురు మృతి

## నలుగురు గల్లంతు

**కతిహార్ :** బీహార్ కతిహార్ జిల్లాలోని గంగానదిలో పడవ మునిగిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గల్లంతయినట్లు అధికారులు తెలిపారు. 17 మందితో ప్రయాణిస్తున్న పడవ అహ్మదాబాద్ ప్రాంతంలోని గోలాఘాట్ సమీపంలో మునిగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం నుంచి పది మంది సురక్షితంగా బయటపడ్డారన్నారు. అందులో అత్యధికులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరారని చెప్పారు. గల్లంతయిన నలుగురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఘటనకు గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తుకు ఆదేశించామని జిల్లా మేజిస్ట్రేట్ మనీష్ కుమార్ మీనా మీడియాకు తెలిపారు. బాధితుల్లో ఇద్దరిని పవన్‌కుమార్ (60), సుధీర్ మండల్ (70)గా గుర్తించారు. మరో వ్యక్తిని గుర్తించాల్సి ఉంది.

# ‘ఇండియన్ స్టేట్’ వ్యాఖ్యలకు రాహుల్‌పై ఎఫ్‌ఐఆర్



**న్యూఢిల్లీ :** దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందంటూ కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ఆసోంలోని గువాహటి పాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. రాహుల్ వ్యాఖ్యలు దేశ సార్వభౌమాధికారానికి, ఐక్యత, దేశ సమగ్రతకు ప్రమాదకరం కలిగి స్తాయని పేర్కొంటూ భారతీయ న్యాయసంహిత లోని 152, 197(1) సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదైంది. మోన్‌జిత్ చాటియా అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దేశంతో పోరాటం సాగిస్తున్నామని ప్రకటించడం ద్వారా నిందితుడు ఉద్దేశపూర్వకంగానే విచ్ఛిన్నకర శక్తులను, ప్రజలపై తిరుగుబాటు చర్యలను రెచ్చగొట్టినట్టే అని ఫిర్యాదుదారు ఆరోపించారు. వరుస వైఫల్యాలతో నైరాశ్యంతోనే రాహుల్ ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దిగారన్నారు. ప్రజాస్వామ్య విధానాల ద్వారా ప్రజా విశ్వాసం పొందలేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ స్టేట్‌పై అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. విపక్ష నేతగా ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసాన్ని పెంపొందించాల్సిన నేత.. ఇందుకు బదులుగా తన హోదాను దుర్వినియోగం చేసుకుంటూ తప్పుడు ప్రచారం, తిరుగుబాటు చర్యలకు పాల్పడటం దేశ సమగ్రత, సార్వభౌమాధికారానికి ముప్పు అని తన ఫిర్యాదులో చాటియా పేర్కొన్నారు. రాహుల్ గాంధీ గత బుధవారంనాడు న్యూఢిల్లీలో నూతన కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, నిజమైన స్వాతంత్ర్యంపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయని, తాము ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపితో పాటు భారతదేశంపై కూడా పోరాడుతున్నామని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రులు విమర్శల దాడికి దిగారు. దేశంతో పోరాడుతున్నామంటూ చెప్పడం ద్వారా కాంగ్రెస్ అసలు స్వరూపం ఇప్పుడు బయటపడిందని బిజెపి ధ్వజమెత్తింది.

# మహాకుంభమేళాలో అగ్నిప్రమాదం



**ప్రయోగ్‌రాజ్ :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. సెక్టార్ 19లోని గుడారాల్లో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో 18 టెంట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. దగ్ధమైన 18 టెంట్లలో మంటలను అదుపు చేయడానికి 15 అగ్నిమాపక యంత్రాలను రంగంలోకి దించినట్లు కుంభమేళా చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రమోద్ శర్మ తెలిపారు. కొంత సమయం తరువాత మంటలు అదుపులోకి వచ్చాయని, ఆ ప్రాంతంలో పరిస్థితి అదుపులో ఉందని శర్మ తెలిపారు. ముందుగా, మహా కుంభమేళాలోని సెక్టార్ 19లో రెండు ఎల్‌పిజి సిలిండర్లు పేలిపోయాయని, శిబిరాల్లో పెద్ద అగ్నిప్రమాదం జరిగిందని అఖారా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి భాస్కర్ మిశ్రా తెలిపారు. సీనియర్ అధికారులు అక్కడికక్కడే ఉండగా, అగ్నిమాపక బృందాలు మంటలను ఆర్పగలిగాయని ప్రభుత్వం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఘటనపట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు మహాకుంభమేళా నిర్వాహకులు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అధికార యంత్రాంగం తక్షణ సహాయ, సహాయ చర్యలను అందిస్తోందని, అందరి భద్రత కోసం తాము గంగా మాతను ప్రార్థిస్తున్నామని ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రభావిత ప్రాంతం నుండి దట్టమైన నల్లటి పొగ ఆకాశాన్నంటుతున్న క్లిప్‌ను కూడా షేర్ చేశారు.

# కేజ్రీవాల్ కాన్వాయ్‌పై దాడి... బిజెపి గూండాల పనే : ఆతిశీ



**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ స్పందించారు. ఈ దాడి బిజెపి గూండాల పనేనని ఆరోపించారు. దాడి చేసిన వారికి ఆ పార్టీకి చెందిన వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. రోహిత్ త్యాగి, సాంకీ అనే ఇద్దరి వ్యక్తుల ఫొటోలను అతిశీ విడుదల చేశారు. వారే ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. శనివారం అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి జరిగింది. కాషాయ పార్టీకి చెందిన గూండాలు ఈ దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడిన రాహుల్ అలియాస్ సాంకీకి బిజెపి నేత పర్వేశ్ వర్మతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయన ప్రచారంలోనూ దుండగుడు పాల్గొన్నాడు. అతడిపై హత్యాయత్నం, దోపిడీ వంటి అనేక కేసులున్నాయి. అలాంటి నేరస్థులను కేజ్రీవాల్‌పై దాడికి పంపించినట్లు స్పష్టమవుతోంది. పర్వేశ్ వర్మతో రోహిత్ త్యాగి దిగిన ఫొటోలు ఉన్నాయి. అతడిపైనా తీవ్ర నేరారోపణలు ఉన్నాయి అని అతిశీ ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. అదే సమయంలో కొందరు దుండగులు ఆయన కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారు. ఓటమి భయంతోనే బిజెపి ఈదాడికి పాల్పడినట్లు ఆప్ ఆరోపించింది.

# భూములిస్తే ఇళ్లు కట్టిస్తా..

## ప్రధాని మోదీకి కేజ్రీవాల్ లేఖ



న్యూఢిల్లీ : ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికుల కోసం సంయుక్త గృహ నిర్మాణ పథకాన్ని ప్రతిపాదిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సుప్రీం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేజ్రీవాల్ మోదీకి లేఖ రాయడం గమనార్హం. కాగా, ఆదివారం కేజ్రీవాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఢిల్లీ ప్రభుత్వానికి అత్యధిక సబ్సిడీ రేట్లకు భూమిని కేటాయించాలని ప్రధాని మోదీని కోరనున్నారు. అందులో ఉద్యోగుల కోసం ఇళ్లు నిర్మించ వచ్చన్నారు. వారి చివరి దశ సర్వీసు కాలం వరకు వాయిదాలు చెల్లించేందుకు సులభమవుతుందన్నారు. పదవీ విరమణ తరువాత ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా సఫాయి కర్మచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేజ్రీవాల్ లేవనెత్తారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పదవీ విరమణ తరువాత ఉద్యోగులు సౌకర్యవంతంగా, గౌరవంగా జీవించేందుకు జాయింట్ గృహ నిర్మాణ పథకాన్ని ప్రతిపాదించానని చెప్పారు. ఈ పథకం ముందుగా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంసిడి, ఎన్‌డిఎంసి ఉద్యోగులకు అమలు చేసి, ఆ తరువాత ఢిల్లీ వ్యాప్తంగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు అమల చేయవచ్చని కేజ్రీవాల్ తెలిపారు. కేజ్రీవాల్ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గం ఎన్‌డిఎంసి పరిధిలో ఉండడం విశేషం. కాగా, ఢిల్లీ ప్రభుత్వానికి సొంతంగా భూమి లేదని అందువల్ల కేంద్ర ప్రభుత్వం సమకూరిస్తే ఎన్నికల అనంతరం అధికారంలోకి రాగానే ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆప్ సుప్రీం పేర్కొన్నారు. ఢిల్లీలో ముఖ్యంగా పేదలకు ఇళ్ల సమస్య అతి పెద్దదిగా మారింది. సొంత ఇళ్లు కట్టుకోవడం లేదా అద్దెకు తీసుకోవడం దాదాపు అసాధ్యంగా మారిందన్నారు. ఇళ్లు అద్దెకు తీసుకునేందుకు గానీ, సొంత ఇళ్లు కొనుగోలు చేసేందుకు గానీ ఉద్యోగుల పెన్షన్ సరిపోదన్నారు. పదవీ విరమణ తరువాత మురికివాడల్లో సఫాయి కర్మచారాలు నివసించడాన్ని తాను స్వతహాగా చూశానన్నారు. అందువల్ల ఈ పథకానికి చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశానన్నారు. పేదల సంక్షేమానికి సంబంధించిన పథకమైనందున మోదీ అంగీకరిస్తారని ఆశిస్తున్నానని కేజ్రీవాల్ చెప్పారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ఇప్పటి వరకు ఆప్ 9 వాగ్దానాలు చేసింది.

**మరోసారి డాక్యుమెంటరీ ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు...**

అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా పార్టీ నాయకుల అరెస్టు ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించడాన్ని మరోసారి ఢిల్లీ పోలీసులు అడ్డుకునే యత్నం చేశారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. అయితే, అన్‌బ్రేకబుల్ డాక్యుమెంటరీని ప్రదర్శించడానికి పార్టీ అనుమతి కోరలేదని, నగరంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు కారణంగా దీనిని అనుమతించలేమని శనివారం పోలీసులు ప్రకటించిన విషయం విదితమే. ఆప్ రాజ్యసభ ఎంపి సంజయ్ సింగ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, డాక్యుమెంటరీ ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి పోలీసులు అనుమతి నిరాకరించారని చెప్పారు. ఏ నియమం ప్రకారం అనుమతి నిరాకరించారో తాను ఎన్నికల సంఘాన్ని అడగాలనుకుంటున్నానన్నారు. బహిరంగ సభ, ఎన్నికల ప్రచారం లేదా ఓటు కోసం విజ్ఞప్తి చేయబోవడం లేదన్నారు.

# యుపిఎస్‌సి పరీక్ష పిటిషన్‌పై సహాయం చేసేందుకు ‘అమికస్ క్యూరీ’

**న్యూఢిల్లీ :** సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన సమాధానాల ‘కీ’లు, మార్కులను వెల్లడించాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)ని ఆదేశించాలని కోరుతూ పలువురు సివిల్ సర్వీస్ ఔత్సాహికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సహాయం చేసేందుకు సుప్రీం కోర్టు అమికస్ క్యూరీని నియమించింది. 2023 సివిల్ సర్వీస్ (ప్రిలిమినరీ) పరీక్ష సహా దాదాపు అన్ని పూర్వ పరీక్షలలో యుపిఎస్‌సి మార్కులు, కట్ ఆఫ్ మార్కులను నిర్వహించి మొత్తం పరీక్ష ప్రక్రియ ముగిసినప్పుడు మాత్రమే సమాధానాల ‘కీ’లు బహిర్గతం చేసేది. న్యాయమూర్తులు పిఎస్.నరసింహ, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం సీనియర్ అడ్వకేట్ జైదీప్ గుప్తాను ఈ విషయంలో సహకరించేందుకు అమికస్ క్యూరీగా నియమించింది. పిటీషన్ కాపీని తమకు అందజేయాలని పిటిషనర్లను కోరింది. ఈ విషయంలో కోర్టుకు ‘అమికస్ క్యూరీ’గా సహకరించాలని కోర్టు ముందున్న సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తాను మేం అభ్యర్థించాం. గుప్తా దీనిని దయతో అంగీకరించారు అని ధర్మాసనం జనవరి 15నాటి ఆర్డర్‌లో వెల్లడించింది. విచారణ సందర్భంగా 17మంది యుపిఎస్‌సికి చెందిన 17మంది ఆశావహుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ బహిర్గతం చేయని యుపిఎస్‌సి ప్రవర్తనలో పారదర్శకత లోపించిందని అన్నారు.

# ఢిల్లీ ఎన్నికల్లో వినూత్న ‘పబ్లిసిటీ స్టంట్స్’ !

- పోటాపోటీగా ఆప్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు సృజనాత్మక వస్తువుల ఆర్డర్లు
- టీషర్ట్స్, ఫంకీ సన్‌గ్లాసెస్, టోపీలపై మోదీ, కేజ్రీవాల్ చిత్రాలు, పార్టీ పేర్లు, సంతకాలు ప్రింట్
- ఆర్డర్లు, కొనుగోళ్ల కోసం సదర్‌బజార్‌లో ‘క్యూలు’




**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం తీవ్రస్థాయికి చేరుకుంది. ఢిల్లీ ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయపార్టీలు అధునాతన వస్తువుల బహుకరణ ఎరవేసేందుకు పోటీపడుతున్నాయి. ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనునాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడబోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయపార్టీలైన ఆమ్ ఆద్మీపార్టీ (అధికార ప్రభుత్వం), బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లను ఆకర్షించేలా, వాటిని వారు ఉపయోగించడానికి అనువైనరీతిలోనే కాకుండా ఎన్నికల ప్రచారానికి కూడా ఉపయోగపడేలా అధునాతన వస్తువుల సృజనాత్మక తయారీకి వ్యాపారపరమైన ఆర్డర్లు ఇవ్వడంలో తలమునకలయ్యాయి. ఓటర్ల ఊహలకు అనుగుణంగా వారిని ఆకర్షించేలా చమత్కారమైన క్యాచ్ ఫ్రేజెస్, వన్ లైనర్లతో సృజనాత్మకంగా రూపొందించిన వస్తువులను డిజైన్‌చేసేందుకు సంబంధిత వ్యాపారులకు ఆర్డర్లు ఇస్తున్నారు. శీతాకాలానికి అనుకూలమైన హుడీలు, రంగురంగుల స్టోల్స్, టీషర్టులు, స్కార్ఫ్స్ , ఫంకీ సన్‌గ్లాసెస్, కీచైన్లు, కస్టమ్ మేడ్ కార్ ఫ్లాగ్స్, కటౌట్లు, పెన్నులు, పోస్టర్లు, మౌజ్‌ప్యాడ్లను ఓటర్లు, పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.‘పార్టీ లోగోలు, నినాదాలతో అలంకరించబడిన ఈ అధునాతన వస్తువులను కేవలం ప్రచారసాధనాలుగా వినియోగించడానికి మాత్రమే కాదు. మద్దతుదారులను మరింత వ్యక్తిగతంగా, శక్తివంతమైన రీతిలో నిమగ్నం చేయడానికి కూడా ఇది ఒక మార్గం’అని నాయకుడు ఒకరు చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ హుడీలు, స్టోల్స్ పై వారి సంతకం, నీలం, పసుపు రంగులో వస్తాయి. ఆర్డర్లు ఇచ్చిన ఈ వస్తువుల ముందుభాగాన ఆమ్ ఆద్మీపార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ముఖం, వెనకభాగాన పార్టీ లోగో వస్తాయి. ఇన్‌స్టంట్‌గా తయారుచేసిన అధునాతన వస్తువులు తయారీచేయబడి బయటకు వస్తాయి అని సదర్‌బజార్‌లో ఉండే ఒక కీలక సరఫరాదారు విక్రమ్ చెప్పారు. ఆమ్ ఆద్మీపార్టీ తరపు కస్టమర్లు కీచైన్లు, రిస్ట్‌బ్యాండ్‌లు, బ్యాడ్జీలు, కారు ఫ్లాగ్స్ ఆర్డర్లు ఇచ్చారని తెలిపారు. ‘మేం ర్యాలీలలో ఉపయోగించేందుకు 2,000నుంచి 2,500వరకు పెద్ద ఫ్లాగ్స్‌ను, 5,000మేరకు చిన్న ఫ్లాగ్స్‌ను ’ తయారు చేస్తున్నాం’ అని విక్రమ్ చెప్పారు. వాటి ధర అనేది వారు ఆర్డరు ఇచ్చిన వస్తువుల సైజ్ ఆధారంగా ఉంటుందని తెలియజేశారు. ప్రారంభధర తక్కువ మొత్తంలో రూ.2.5లక్షల నుంచి ఉంటుందని, ఒక్కో వస్తువుకు రూ.165ధర పలుకుతుందని చెప్పారు. భారతీయ జనతా పార్టీ ప్రచారంలో చమత్కారాన్ని జోడించింది. ఫంకీ ఆరెంజ్ సన్‌గ్లాసెస్‌పైన తెలుపురంగులో పార్టీ పేరు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. నరేంద్రమోదీ చిత్రాలను కలిగి ఉన్నటువంటి టీషర్ట్‌లను బిజెపి ఆర్డర్ చేసింది. కాగా కాంగ్రెస్ పార్టీ వినియోగవస్తువుల వైపే మొగ్గు చూపుతోంది.పార్టీ గుర్తు ఉన్నటువంటి మౌజ్ ప్యాడ్లు, పెన్నులు, కీచెయిన్లపై పార్టీ సింబల్ ఉండేలా పెద్దయెత్తున ఆర్డర్లు ఇచ్చిందని ఒక అమ్మకందారు చెప్పారు. సప్లయర్లు 60శాతం పెరుగుదలను నివేదించడంతో గత కొన్నివారాలుగా రాజకీయ వస్తువులకు డిమాండ్ బాగా పెరిగిందని, ఎన్నికల సీజన్ అంతా మాకు అత్యంత రద్దీ తాకిడి ఉంటుందని. ఈ సమయంలోనే మేం ఎంతో బిజీగా ఉంటామని, కాలంతో పోటీపడతామని సదర్‌బజార్‌కు చెందిన సప్లయర్ అనిల్ సేథీ చెప్పారు. ఈ ఏడాది ప్రచార వస్తువుల తయారీలో అత్యంత సృజనాత్మకత, వైవిధ్యం అసాధారణంగా ఉన్నాయని సేథీ తెలియజేశారు. నామినేషన్లు, ర్యాలీల కోసం అభ్యర్థులు ప్రజలు, అభ్యర్థులు రాజకీయ పార్టీల కండువాలు, దండలు, జెండాలు, మరెన్నో వస్తువులను భారీ సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ర్యాలీల సందర్భంగా టీషర్ట్‌లు, టోపీలు, పోస్టర్లు, బ్యానర్లు, పార్టీ సింబల్ కటౌట్లు, నాయకుల ఫేస్ కటౌట్లకు అధికమొత్తంలో డిమాండ్ ఉందని అనిల్‌సేథీ వివరించారు.

# సైఫ్‌పై దాడి నిందితుడికి 5 రోజుల పోలీస్ కస్టడీ



**ముంబయి :** సైఫ్ అలీఖాన్‌పై ముంబయి నివాసంలో దాడికి పాల్పడిన నిందితుడికి ముంబై కోర్టు జనవరి 24వ తేదీ వరకూ పోలీస్ కస్టడీ విధించింది. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు నిందితుడిని బాంద్రాలోని హాలిడే కోర్టు ముందు ముంబై పోలీసులు హాజరుపరిచారు. ఈనెల 16వ తేదీ తెల్లవారుజామున దొంగతనం కోసం ముంబై బాంద్రా ఏరియాలోని సైఫ్ ఇంట్లోకి అడుగుపెట్టిన నిందితుడు ఆ క్రమంలోనే సైఫ్‌పై పదునైన బ్లేడుతో పలుమార్లు దాడికి పాల్పడ్డాడు. శరీరంపై ఏడు చోట్ల గాయాలైన సైఫ్ ఆ వెంటనే నగరంలోని లీలావతి ఆసుపత్రిలో చేరారు. అక్కడే ఆయనకు శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం లేదని వైద్యులు ప్రకటించారు. నిందితుడి కోసం గాలించిన ముంబై పోలీసులు థానే జిల్లాలోని హీరానందని ఎస్టేట్ వద్ద అతన్ని ఆదివారం ఉదయం పట్టుకున్నారు. నిందితుడిని బంగ్లాదేశ్‌కు చెందిన మహమ్మద్ షరిఫుల్ ఇస్లాం షెహజాద్‌గా గుర్తించామన్నారు. అతను బిజాయ్ దాస్‌గా పేరు మార్చుకుని ఇండియాలోకి అడుగుపెట్టినట్టు తెలిపారు. చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ ఐదు నెలల నుంచి ముంబైలో ఉన్నట్టు చెప్పారు. కాగా, నిందితుడు బంగ్లాదేశ్ పౌరుడని పోలీసులు చెప్పడాన్ని బిజాయ్ దాస్ తరఫు న్యాయవాది తోసిపుచ్చారు. తన క్లయింట్ ఆరు నెలల క్రితం ఇక్కడక వచ్చినట్టు పోలీసులు చెప్పిన కథనంలో నిజం లేదని. ఏడేళ్లుగా అతని థానేలో తన కుటుంబ సభ్యులతో ఉంటున్నాడని చెప్పారు. ఇది పూర్తిగా 43ఎ ఉల్లంఘన కిందకు వస్తుందని, సరైన ఇన్వెస్టిగేషన్ జరగలేదని తెలిపారు. తన క్లయింట్‌కు 5 రోజుల పోలీస్ కస్టడీ విధించినట్టు చెప్పారు. ఇదే సమయంలో నిందితుడికి సంబంధించిన నివేదిక 5 రోజుల్లో సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించిందని తెలిపారు.

# అగ్నిప్రమాదంలో నలుగురు మృతి



**ఘజియాబాద్ :** ఆదివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా ఘజియాబాద్‌లోని ఒక ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు సహా నలుగురు నిద్రలో సజీవ దహనం అయ్యారని అధికారులు తెలిపారు. లోనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాంచన్ పార్క్ ప్రాంతంలోని బహుళ అంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. ఉదయం 7.06 గంటలకు లోనీ అగ్నిమాపక కేంద్రానికి ఈ సంఘటన గురించి సమాచారం అందిందని, మూడు అగ్నిమాపక యంత్రాలు సేవలందించాయని అగ్నిమాపక శాఖ తెలిపింది. స్థలానికి చేరుకున్న తర్వాత, ఇంటి రెండవ, మూడవ అంతస్తులలో మంటలు చెలరేగాయని, ప్రజలు లోపల చిక్కుకున్నారని తేలింది. ఇల్లు రద్దీగా ఉండే లేన్‌లో ఉంది, అందువల్ల అగ్నిమాపక యంత్రాలను బయట నిలిపి ఉంచారు. ఇరుకైన మెట్లు, ఇంట్లోని పొగ వల్ల పైకి వెళ్లడం కష్టమైందని, ఇంటి గోడలు విరిగిపోయాయని, పక్కనే ఉన్న ఇళ్ల ద్వారా గొట్టం పైపుల ద్వారా నీటిని చల్లడం ప్రారంభించారని అగ్నిమాపక శాఖ తెలిపింది. భవనం టెర్రస్‌పై నలుగురు వ్యక్తులు కనిపించారు. వారిలో ఇద్దరు ఆయేషా, ఆమె నాలుగేళ్ల కుమారుడు అయాన్ గాయపడగా, మిగిలిన ఇద్దరు షానవాజ్, షంషాద్‌లను సురక్షితంగా బయటకు వచ్చారని అధికారులు తెలిపారు. మంటలను ఆర్పిన తర్వాత, అగ్నిమాపక సిబ్బంది ఇంటి లోపల నాలుగు మృతదేహాలను కనుగొన్నారని చీఫ్ ఫైర్ ఆఫీసర్ రాహుల్ పిటిఐకి తెలిపారు. బాధితులను షానవాజ్ భార్య గుల్బహర్, వారి ఇద్దరు మైనర్ కుమారులు, అదే ఇంట్లో నివసించే వారి బంధువులలో ఒకరి కుమారుడుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

## క్యూఆర్ కోడ్ స్కాన్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** పోలీస్ సేవలపై ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేసేందుకు ఏర్పాటు చేసినా క్యూఆర్ కోడ్ స్కాన్ ల ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పి జానకి ప్రజలకు సూ చించారు. ప్రజలు తమకు అందుతున్న పోలీస్ సేవల గురించి తమ అభిప్రాయం తెలియజేసేందుకు క్యూర్ కోడ్ స్టికర్స్‌లను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో, సర్కిల్ కార్యాలయాలలో, డిఎస్‌పి కార్యాలయం, జిల్లా పోలీస్ కార్యాలయంలో అతికించడం జరిగిందని, పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ప్రజలు వారికి అందుతున్న పోలీస్ సేవల గురించి ఐదు అంశాలు (ఫిర్యాదులు/పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈ చాలన్ ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్ పోర్ట్ ధ్రువీకరణ ఇతర అంశములు) అంశాలలో తమ అభిప్రాయాన్ని స్వచ్ఛందంగా స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయాలని, జిల్లా ప్రజలు ఈ క్యూఆర్ సౌకర్యాన్ని సద్వివినియోగం చేసుకోవాలని ఎస్పి కోరారు.

## 'నేడు' ప్రజావాణి రద్దు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్లు జిల్లాకలెక్టర్ బదావత్‌సంతోష్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న అమలుచేయనున్న నాలుగు సంక్షేమపథకాలకు సంబంధించి (రైతుభరోసా, ఇందిర మ్మ ఆత్మీయభరోసా, కొత్త ఆహారభద్రత కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల) సర్వేకొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని అధికారులందరూ క్షేత్రస్థాయి పరిశీలనలో నిమగ్నమై ఉన్నందున ఈనిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నా రు. జిల్లాప్రజలు ఈవిషయాన్ని గమనించి 20వతేదిన వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావొద్దని విజ్ఞప్తి చేశారు. తిరిగి 27న సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

## పాఠశాల నిర్మాణానికి ఎమ్మెల్యే భరోసా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం నాగుదేవుపల్లె గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని గ్రామస్తుల సూచనమేరకు పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి నూతన పాఠశాల భవన నిర్మాణానికి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. నూతన భవననిర్మాణ ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే అందుకుకావాల్సిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించి వీలైనంత త్వరగా నూతన భవనాన్ని నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని గ్రామస్థులకు భరోసా కల్పించారు. ఎమ్మెల్యేవెంట గ్రామస్తులు, మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, జిల్లాయూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## వడ్డెరసంఘం అధ్యక్షుడిగా ఆంజనేయులు



**ప్రజాపక్షం/వెల్దండ :** వడ్డెర సంఘం నూతన అధ్యక్షుడిగా వరికుప్పల ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండలకేంద్రంలో తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు, ఉపాధ్యక్షురాలు దండుగుల మల్లేశ్వరి సమక్షంలో కల్వకుర్తి నియోజకవర్గ వడ్డెర సంఘం నూతన అధ్యక్షుడిగా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికిచెందిన వరికుప్పల ఆంజనేయులును నియమిస్తున్నట్లు ప్రకటించారు.కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తరిగణేష్, జిల్లా ఉపాధ్యక్షులు దేరంగుల శ్రీను, కల్వకుర్తి మండల అధ్యక్షుడు గణేష్, కల్వకుర్తిపట్టణ అధ్యక్షురాలు సంపంగి శారద, తాలుకా కార్యదర్శి దేరంగుల వెంకటేష్ పాల్గొన్నారు.

## తపాల సేవలపై విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** తపాలా శాఖ ప్రజలకు అందించే పథకాలపై తపాల శాఖ సిబ్బంది గ్రామాలలో ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో తపాల సిబ్బంది కరపత్రాలను పంచుతూ కేంద్ర ప్రభుత్వం తపాల శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రతి సంవత్సరం రూ.755 చెల్లిస్తే 15 లక్షల ప్రమాద బీమా, రూ. 555 చెల్లిస్తే రూ. 10 లక్షల ప్రమాద భీమా వర్తిస్తుందని అంతేకాక, శాశ్వత వైకల్యం కలిగిన అంతే భీమా వర్తిస్తుందని, ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే రోజువారిగా 500 నుంచి 1000 రూపాయలు, ఐసియులో ఉంటే రూ. 1000 నుంచి 2000 రూపాయలు, వంటి ప్రయోజనాలను ప్రజలకు సిబ్బంది వివరిస్తున్నారు. శాశ్వత అంగవైకల్యం కలిగిన ఈ పథకం వర్తిస్తుందని వీపనగండ్ల పోస్టుమాస్టర్ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. బీమా పాలసీలు చేయదలచుకున్న వారు సమీప పోస్ట్ ఆఫీస్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్మాస్టర్లు అమరేందర్ రెడ్డి, జైపాల్ యాదవ్ , ఎబిఎం నందిని పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/ కొత్తకోట :** కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే , మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. ముందుగా కానాయపల్లి స్టేజి దగ్గర బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నక్కల శాంతన్న ఏర్పాటు చేసిన శ్రీ రాజరాజేశ్వరి ట్రేడర్స్ షాపును సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. కానాయపల్లి తండాలో ఇటీవల చనిపోయిన రూప్ల నాయక్ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా కానాయపల్లి గ్రామంలో బైండ్ల లక్ష్మీ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతురాలికి నివాళులర్పించారు. బిసి సంఘం నాయకులు భీమన్నా నాయుడు తల్లి ఇరుపునూరి అబ్బులమ్మ చనిపోవడంతో కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. బిఆర్ఎస్ కార్యకర్త జంగిడి రాజు తల్లి గుండెపోటుతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి వైస్ చైర్మన్ వామన్ గౌడ్ , మాజీ జెడ్పిటిసి విశ్వేశ్వర్, మాజీ ఎంపిపి గుంత మౌనిక, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు నెహ్రూ, కౌన్సిలర్ నాగన్న, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల మధ్య సహనంతో పనిచేయాలి

### సివిల్ విభాగంలో చేరిన ఎఆర్ కానిస్టేబుళ్లకు సిపి సివి ఆనంద్ సందేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'మీరు చాలా సహనంతో, వివిధ వర్గాల ప్రజల మధ్య పని చేయాల్సి ఉంటుంది' అని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ఆర్మ్డ్ రిజర్వ్ నుంచి సివిల్ విభాగంలో చేరిన కానిస్టేబుళ్లకు సందేశం ఇచ్చారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని ఐసిసిసి కాన్ఫరెన్స్‌హాల్‌లో 573 సిఎఆర్ కానిస్టేబుళ్లతో ఇంటరాక్షన్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ సిఎఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న 573 మంది ఎఆర్ పోలీస్ కానిస్టేబుళ్లను (మహిళలు 223, పురుషులు 350) హైదరాబాద్ సిటీలోని మొత్తం 71 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లకు 284, ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ 225, స్పెషల్ బ్రాంచ్ 25, టాస్క్ ఫోర్స్ 25, హెచ్ఎన్‌యు 8, సైబర్ క్రైమ్ 6 అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. శిక్షణ అనంతరం 450 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 873 మంది సిఎఆర్ కానిస్టేబుళ్లు విధులకు హాజరయ్యారన్నారు. అదనంగా 200 మంది కానిస్టేబుళ్లను, మరో 100 మంది కానిస్టేబుళ్లను డ్రైవర్లుగా, అదనంగా 10 ప్లాటూన్లకు కేటాయించిన తరువాత, మిగిలిన 573 మందిని పోలీసు స్టేషన్లు, ట్రాఫిక్, ఇతర విభాగాలకు అటాచ్ చేస్తూ అక్కడ ఉన్న కొన్ని ఖాళీలను భర్తీ చేస్తూ సివిల్ పోలీసుల విధులకు వీరితో మరింత చేయూత అందుతుందన్నారు. సివిల్ పోలీసులతో మమేకమై పని చేయాలని సూచించారు. చాలా సహనంతో, వివిధ వర్గాల ప్రజల మధ్య పని చేయాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ రాజధాని కావున, శాంతి భద్రతలను కాపాడుకోవడం మనందరి ముఖ్య కర్తవ్యమన్నారు. సివిల్ పోలీసు విధుల్లో చేరిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఇది కేవలం అటాచ్‌మెంట్ మాత్రమేనని, వారికి సీనియారిటీ లేదా విభాగము మార్పిడి హక్కులు ఉండవని, పోలీసు స్టేషన్లలో పెట్రోలింగ్, ప్రాథమిక విధులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్న సివిల్ పోలీసుల కొరతను అధిగమించడానికి ఈ విధముగా అటాచ్‌మెంట్ చేస్తున్నామని వారికి తెలిపారు. హైదరాబాద్ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మనము హైదరాబాద్‌లో శాంతి భద్రతలను అదుపులో ఉంచాలని, నేరాలను అరికట్టాలని వారికి సూచించారు. అందువల్ల నేరాల నివారణకు పెట్రోలింగ్‌ను పెంచాల్సిన అవసరం ఉందన్నారు.
మన హైదరాబాద్ నగరాన్ని ప్రశాంతంగా ఉంచాలని, అప్పుడే మన రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని, జిడిపి పెరుగుతుందని, మన రాజధాని హైదరాబాద్ నగరానికి మంచి పేరు వస్తుందని, ఇందుకోసమే హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ విభాగాలను బలోపేతం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. విధుల్లో ఉన్నప్పుడు ఏదైనా చిన్న సమాచారం వచ్చినా, ఏదైనా సంఘటన చూసినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ జంక్షన్ల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉందని, మీరు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. మీరు పని చేస్తున్న ప్రదేశంలోని స్థానిక ప్రజలు, పెద్దలతో స్నేహపూర్వకంగా ఉండేలా చూసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమములో అదనపు సిపి విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సిపి పరిమళ హనా నూతన్, సిఎఆర్ డిసిపి రక్షిత కృష్ణ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెబ్బేరులో ఎమ్మెల్యే మేఘారెడ్డి పర్యటన

### పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల కేంద్రంలో నిర్వహించిన చెలిమిళ్ల ప్రిమియర్ లీగ్ క్రికెట్ పోటీల విజేతలకు ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా బహుమతి ప్రధానోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే కాసేపు క్రీడాకారులతో క్రికెట్ ఆడి యువకులను ఉత్సాహపర్చారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కార్యాలయం పక్కన గల క్రీడా మైదానంలో శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి మాత ఉత్సవాల సందర్భంగా నిర్వహించే పెబ్బేరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ క్రీడాకారులతో ఆటలాడి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలను అందరూ స్పూర్తిదాయకంగా తీసుకోవాలని గెలుపు ఓటములు ప్రతి ఒక్కరికి సహజమని ఓటమి చెందిన వారు మరింత కసిగా ఆడి వారివారి ప్రతిభను నిరూపించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పెబ్బేరు మండల కేంద్రానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు శివకుమారుడి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని కేక్‌ను కట్ చేసి బాబుకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన డాక్టర్ వేణుగోపాల్ ఇటీవల గుండెకు శాస్త్ర చికిత్స చేయించుకున్నారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్య పరమైన సహాయ సహకారాలు అందిస్తానని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. మార్కెట్ యార్డ్ స్థలంలో నూతనంగా నిర్మించిన వాలీబాల్ క్రీడ మైదానాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. వాలీబాల్ క్రీడాకారులతో కొంత సేపు ఆట ఆడారు. క్రీడలతో జాతీయ స్థాయి గుర్తింపును పొందవచ్చునని , యువకులు ఉన్నత విద్య ఉపాధితో పాటు క్రీడలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. మండల కేంద్రంలోని 1వ వార్డు కౌన్సిలర్ అక్కమ్మ భర్త మంద బాబు గత కొంత కాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ ఇటీవలే శాస్త్ర చికిత్స చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎలాంటి ఇబ్బందున్న తన దృష్టికి తీసుకురావాలని అన్ని విధాల తను అండగా ఉంటారని అక్కమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , పెబ్బేరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు ఎల్లస్వామి, ఆశ్విని సత్యనారాయణ, అక్కమ్మ, నాయకులు రంజిత్ కుమార్ , దయాకర్ రెడ్డి, యుగేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ , యాపర్ల రాంరెడ్డి, రాముల యాదవ్ , చెలిమిళ్ల రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నీటిశుద్ధి కేంద్రం ప్రారంభం




**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామంలో ఐక్యతఫౌండేషన్ సహకారంతో దాదాపుగా రూ.3లక్షలు విలువచేసే మినరల్‌వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ఆసంస్థ చైర్మన్, టాస్క్ సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఇదివరకు కుప్పగండ్ల గ్రామానికి గ్రామ పర్యటన నిమిత్తం వచ్చిన ఆయనకు గ్రామస్తులు గ్రామంలో తీవ్ర తాగునీటి కొరత ఏర్పడిందని తామూ పడుతున్న బాధలను స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొని స్పందించిన రాఘవేందర్‌రెడ్డి తన సొంత నిధులతో ఐక్యత ఫౌండేషన్ ద్వారా రూ.3 లక్షలతో నిర్మాణం పూర్తి చేసి మినరల్‌వాటర్ ప్లాంట్ ప్రారంభించి గ్రామస్తులకు ఉచిత తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పగండ్ల గ్రామంలో పర్యటించడం ఆనందంగా ఉందని గ్రామంలో ఎప్పుడూ ఏ సమస్య ఉన్న ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తాగునీరు అనేది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయమన్నారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో ప్రజలు ఎవరూకూడా తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడొద్దని నియోజకవర్గం వ్యాప్తంగా పెద్ద ఎత్తున మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి సురక్షిత మంచినీరు అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇంకా ఐక్యత ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సేవలు భవిష్యత్తులో కూడా ఇంకా పెద్ద ఎత్తున అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలసాని వెంకట్‌రెడ్డి, కుప్పగండ్ల యువనాయకుడు మొక్తాలరమేష్, దామోదర్‌రెడ్డి, చెన్నయ్య గౌడ్, శ్రీనుసాగర్, రమేష్‌యాదవ్, కుమ్మరిరమేష్, ప్రభాకర్‌సాగర్, శివరాజుగౌడ్, రమేష్‌గౌడ్, శ్రీధర్, గోరటిజంగయ్య, గణేష్, కృష్ణ, బాలరాజు, మురళియాదవ్, మహేష్‌ముదిరాజ్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



# అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

**● గ్రామ సభలలో దరఖాస్తుల స్వీకరణ ● రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ : కలెక్టర్ విజయేందిర బోయి**




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామన్నారు. ఇందులో ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ నెల 21 నుంచి 24 వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డ్‌ల లబ్ధిదారుల జాబిత కులగణన (సామాజిక) సర్వే ఆధారంగా తయారు చేసిందని ఇది తుది జాబితా కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలను శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకై దరఖాస్తులు కూడా స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే గతంలో జరిగిన ప్రజాపాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తు జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందని ఆమె తెలిపారు. ఈనెల 26 ప్రారంభించే నాలుగు పథకాలపై తీసుకోవడంతో పాటు ఈ గ్రామ సభలు, ప్రజాపాలన సేవా కేంద్రాలలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎండిఒ కార్యాలయంలో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను తగు రీతీలో పరిశీలించిన తర్వాత మాత్రమే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. అర్హులైన తుది జాబితాలను ప్రకటించడానికి ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్‌కార్డులను ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లినవారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ కుటుంబంలో మహిళల బ్యాంకు ఖాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల మున్సిపాలిటీలలో కలిసిన గ్రామాల్లో 2023 –24లో జరిగిన ఉపాధి హామీ పనుల జాబితాను పరిగణనలో తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు ఈనెల 21వ తేదీ నుండి 24 వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల మాదినిగానే 21నుండి జరిగే గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## గుండెపోటుతో రైతు మృతి



**ప్రజాపక్షం /మద్దూర్ :** గుండె పోటుతో ఓ రైతు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో జరిగింది. గ్రామస్తులు, కుటుం బ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన బంకుల అనంత్ రెడ్డి (60) గ్రామ సమీపంలో తనకున్న పొలంలో వేరు శనగ వేసి అమ్మేందుకు ఆరబెట్టాలని పొలం వద్దనే సిద్ధం చేస్తున్నాడు. గత వారం రోజులుగా రాత్రింబవళ్లు కాపలా కాస్తు కొంత అమ్మాడు. మిగిలిన ధన్యం శుద్ధి చేసేందుకు పొలానికి వెళ్లేందుకు తన భార్య అమృతమ్మకు చెప్పాడు. ముఖం కడిగేందుకు బాత్ రూంలోకి పోయిన ఆయన ఒక్కసారిగా తన భార్య చూస్తుండగానే కుప్ప కులాడు. సమీప ఇరుగు పొరుగు వారు మద్దూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. హార్ట్ ఏటాక్‌తో అప్పడికే చనిపోయినట్లు డాక్టర్ చెప్పాడు. తన కళ్లెదుటే ఘటనను చూసిన భార్య బోరున ఏడ్చింది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉండగా వారందరికి పెళ్లిళ్ళయ్యాయి. కాగా మంచి ఆరోగ్యంగా ఉండే వాడని మనసున్న మనిషిని కోల్పోయామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## మైనర్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/నారాయణపేట :** రోడ్డు భద్రత మసోత్సవాలు సందర్భంగా జిల్లా ఎస్పి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ఆదివారం మక్తల్ పట్టణంలో ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహన దారులు హెల్మెట్ వినియోగించకున్న, మైనర్ డ్రైవింగ్ చేసిన, నంబర్ ప్లేట్ లేకున్నా వాహనాలకు సరైన పత్రాలు లేని 18 వాహనాలు సీజ్ చేయటం జరిగిందని ఎస్ఐ తెలిపారు. వాహనదారులు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి కింది సూచనలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ తెలిపారు.

## సాయన్న విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే

**ప్రజాపక్షం / మక్తల్ :** జిల్లెలగూడ, మీర్ పేట్ ముదిరాజ్ మహసభ ఆధ్వర్యంలో చందన చెరువు కట్టపై ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి ముదిరాజ్ కండువా కప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ సాయన్న పెద్దోళ్లను కొట్టి పెదోలకు పెట్టిన మహనీయుడు అని ఆయన కొనియాడారు.




## కొత్త ఆసరా పింఛన్లు ఇవ్వాలి : సిపిఐ

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** కొత్త ఆసరా పింఛన్లు, మహిళకు రూ.2500 జనవరి 26 నుంచి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, భారత జాతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం వనపర్తి సిపిఐ జిల్లా ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. వితంతువులు , వికలాంగులు , వృద్ధులు ఆసరా పింఛన్ కోసం చేసుకున్న దరఖాస్తులు మూడేళ్లుగా పెండింగ్‌లు ఉన్నాయన్నారు. వారికి వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేసి జనవరి 26 నుంచి పంపిణీ చేయాలన్నారు. జనవరి 26 నుంచి వికలాంగులకు రూ.6వేలు, ఇతరులకు రూ. 4వేలు ఫించన్ ఇవ్వాలన్నారు. మహిళలకు రూ. 2500 ఇస్తామన్న హామీని ఈ నెల నుంచే అమలు చేయాలన్నారు. నియోజకవర్గానికి ప్రభుత్వం మొదటి విడతలో 3500 ఇం డ్లు కేటాయించింద , ఇవి ఏ మూలకు సరిపోవని, 5000లకు పెంచాలన్నా రు. కొత్త రేషన్ కార్డులు కూడా జనవరి 26 నుంచి ఇచ్చేందుకు, ప్రతిగ్రామానికి 30,40 కుటుంబాల అర్హుల జాబితా పంపారని, అర్హత ఉన్న చాలా కు టుంబాల పేర్లు ఆ జాబితాలలో లేవన్నారు. పునః పరిశీలన చేయాలన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగమైన వీటిని వెంటనే అమలు చేయాలని కోరారు. సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ , నాయకులు లక్ష్మీ నారాయణ, రాంబాబు, చిన్న కుర్మయ్య, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూనెడ్‌లో అట్టహాసంగా క్రికెట్ టోర్నమెంట్



**ప్రజాపక్షం / మద్దూర్ :** భూనేడ్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిన్న వెంకటయ్య గౌడ్ స్మారక టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్ గత 11 రోజుల నుండి కొనసాగాయి. ఫైనల్‌లో గెలిచిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశా రు. మొదటి విజేత భీంపూర్ జట్టుకు రూ.20వేలు చెక్కును, అదేవిధంగా భూనిడ్ జట్టుకు రూ.10వేల చెక్కును మురారి గౌడ్ అందజేశారు. అదేవిధం గా కోట్లల మహేందర్ రెడ్డి గెలిచిన వారికి ట్రోఫీలను అందజేశారు. ఆటను తిలకించడానికి అదేవిధంగా క్రీడాకారులకు శ్రీనివాస్ యాదవ్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు , క్రీడాకారులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గర్భిణికి 'యువశక్తి ఫౌండేషన్' రక్తదానం

**ప్రజాపక్షం / ధన్వాడ :** మండలానికి చెందిన స్వప్న అనే గర్భిణి డెలివరీ కోసం నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. అనంతరం పరీక్షించిన వైద్యులు రక్తం తక్కువ ఉంది. వెంటనే అరుదుగా దొరికే ఏ నెగటివ్ రక్తం ఎక్కించాలని చెప్పడంతో ఉమ్మడి పాలమూరు జిల్లా బ్లడ్ బ్యాంకులలో మొత్తం వెతికి దొరకక పోవడంతో కుటుంబ సభ్యులు ఆం దోళనలో పడ్డారు. ఎవరు ముందుకు రాకపోవడంతో కనిపించిన వారందరిని ఆడగటంతో యువశక్తి ఫౌండేషన్ అండగా ఉంటుందనే విషయం స్థా నికుల ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్‌ని ఆశ్రయించినట్లు ఫౌండేషన్ జిల్లా ప్రెసిడెంట్ ప్రవీణ్ తెలిపారు. అదే విధం గా ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలని యువత కు పిలుపునిచ్చారు. పాప పుట్టడంతో కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా యువశక్తి ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ , గణేష్ శేకర్ , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం..

**ప్రజాపక్షం/జడ్చర్ల :** రాజాపూర్ మండలం బిబినగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చంద్రియా నాయక్ తండాకు చెందిన జాటవత్ లచ్చి (70) అనారోగ్యంతో మరణించింది. మృతికి సంతాపం తెలిపిన బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమాన్యు రెడ్డి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.5000 ఆర్థిక సహాయన్ని యువసేన సభ్యుల ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యువత విభాగం ప్రధాన కార్యదర్శి విజయ్ రాథోడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేతావత్ రవి నాయక్, జటవత్ రామ్ లాల్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, అభియాన్యు యువసేన సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## గత ప్రభుత్వ నిర్ణయాలతో రైతులకు కష్టాలు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలపై కెటిఆర్ చేసిన ట్వీట్‌పై కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా.కోట నీలిమ ఆగ్రహం వ్యక్తంచేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాల తోనే రైతుల కష్టాలపాలయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతుల్లేకుండా రైతులకు ఎకరానికి రూ.12 వేలు, భూమిలేని రైతులు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, రూ.2లక్షల వరకు రుణమాఫీ, సన్నబియ్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందజేస్తున్నదని వివరించారు. రైతుల జీవితాలను మెరుగుపరచడం, నిస్వార్థ సేవ చేయడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని నీలిమ రీట్వీట్ చేశారు.

# మహానగరి

## సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే లక్ష్యం..

**హైదరాబాద్ :** సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే లక్ష్యంగా మాదాపూర్‌లో గంజాయి, హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠాను శంషాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 830 గ్రాముల గంజాయి, 14 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గంజాయి అలవాటు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. కాగా హైదరాబాద్‌లో గంజాయి విక్రయిస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన రాజు జాట్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 62 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రాజు జాట్ ఒడిశాలో గంజాయి కొని తెలంగాణ, మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు

## తలసాని వ్యాఖ్యలపై ఖండన



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** సనత్‌నగర్ నియోజకవర్గం బన్సీలాల్‌పేటలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటూ స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ వ్యాఖ్యానించడాన్ని స్థానిక డివిజన్ కాంగ్రెస్ నేతలు ఖండించారు. ఎమ్మెల్యే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ కాంగ్రెస్ ఎస్‌సి సెల్ చైర్మన్ జి.ఎల్.రమేశ్, కాంగ్రెస్ నేత శివకుమార్ లాల్ మీడియాతో మాట్లాడుతూ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం 2021, 2023లో రెండుసార్లు బన్సీలాల్‌పేట డివిజన్ బోయిగూడలో రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులకు శిలాఫలకం ఏర్పాటు చేసి, పనులు మాత్రం గాలికొదిలేశారని విమర్శించారు. గతంలోనే నిధులు మంజూరైనా పనులను ఎమ్మెల్యే ఎందుకు ప్రారంభించడంలేదని ప్రశ్నించారు. రోడ్లను తవ్వి పైప్‌లైన్‌లు వేయకపోవడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ప్రజల పట్ల, నియోజకవర్గం అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. పి.చంద్రశేఖర్, పండుగౌడ్, కృష్ణ ముదిరాజ్, అబ్దుల్ కలీం, కె.ఎల్.శ్రవణ్, శ్రీహరి, కృపా ప్రసాద్, హరి, సునీల్, మహేశ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధిరంగాల్లో రాణించేందుకు యువత కృషి

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/షాబాద్:** యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని ఐతాబాద్‌లో రిక్కీ రెడ్‌మెంట్ క్లాత్ షోరూంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా స్వయం శక్తితో ఉపాధి అవకాశాలు కల్పించుకునే విధంగా తయారైనప్పుడే అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లాత్ మర్చంట్ ప్రోపరేటర్ గగనం వీరప్ప, రాక్‌చర్చ్ పాస్టర్ విజయ్‌కుయార్, సాల్మన్ దావిద్, దానియల్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## మామిడిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి

డిపో మేనేజర్‌కు వినతి



**ప్రజాపక్షం/నందిగామ:** ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపార వేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని షాద్‌నగర్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సిఫార్స్ లేఖను నందిగామ మాజీ ఎంపిటిసి కొమ్ము కృష్ణ, అప్పారెడ్డిగూడ మాజీ ఉప సర్పంచ్ సీతారాములు, మార్కెట్ కమిటి డైరెక్టర్ మల్లేష్‌లు డిపో మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చి సమస్యలను వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మామిడిపల్లి గ్రామానికి బస్సుసౌకర్యం ఎలా ఉండేదే అదే తరహాలో పున:రుద్ధరించాలని కోరారు. షాద్‌నగర్ నుండి నందిగామ, అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, మొదళ్ళగూడ, మాజీద్ మామిడిపల్లి, గుడి మామిడిపల్లి, మామిడిపల్లి గ్రామాలకు ఉదయం నుండి సాయంత్రం వరకు బస్సులు నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ మార్గంలో బస్సు సౌకర్యం కల్పిస్తే రోజువారి ప్రయాణికులు, విద్యార్థులకు ఎంతో మేలు చేసినట్లు అవుతుందని వివరించారు. దాంతో ఆర్టిసికి ఆదాయం వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు

## యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు దోహదం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/నందిగామ:** యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు దోహదపడుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం నందిగామ మండల కేంద్రంలోని నందిగామ ప్రీమియర్ లీగ్ సీజన్8 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ యువతకు క్రీడలను ఆలవాటు చేయడంలో ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. మాజీ ఎంపిటిసి కొమ్ము కృష్ణ రూ.2లక్షల ఆర్థిక సహకారంతో క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. క్రీడలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యత ఇస్తుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్, మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, కొత్తూరు మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నందిగామ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ్మా, ఎంపిటిసిలు కుమారస్వామి గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌చారి, ఎస్టిసెల్ నాయకుడు శ్రీనునాయక్‌లతోపాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మేడ్చల్ – శామీర్‌పేట్ కారిడార్లకు వినూత్న 'మెట్రో' మార్గాలు

ఈ రెండు కారిడార్లతో ఎయిర్ పోర్ట్ కారిడార్ అనుసంధానం

ముఖ్యమంత్రి దార్శనికతకు అద్దం పట్టేలా

జెబిఎస్ వద్ద ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ మెట్రో రైల్ హబ్

జెబిఎస్, కంటోన్మెంట్ ప్రాంతాల్లో పర్యటించిన మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్ రెడ్డి



ప్రపంచస్థాయి మెట్రోహబ్‌గా జెబిఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రెండవ దశలో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. మేడ్చల్, శామీర్‌పేట్ దిశగా నిర్మించే కారిడార్ల కొత్త రూపురేఖలు సంతరించుకోనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దార్శనికతకు అనుగుణంగా మెట్రోరైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి సారథ్యంలో సాంకేతిక నిపుణులు, అధికారులు హైదరాబాద్ ప్రజల సౌకర్యవంతమైన ప్రయాణానికి కొత్త మెట్రోరైల్ మార్గాలను రూపొందించే కసరత్తును ప్రారంభించారు. ప్యారడైజ్ మేడ్చల్ (23 కి.మీ), జెబిఎస్ శామీర్‌పేట్ (22 కి.మీ) ప్రతిపాదిత కారిడార్ అలైన్‌మెంట్‌ల విషయంలో ఉన్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి మెట్రోరైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి, సీనియర్ ఇంజనీర్లు, సాంకేతిక సలహాదారులు ఆదివారం క్షేత్ర పరిశీలన జరిపారు. ఈ రెండు కారిడార్ల ఏర్పాటులో ఇంజనీరింగ్ పరంగా ఎదురవుతున్న కొన్ని సంక్లిష్ట అంశాలను గుర్తించారు.

### సంక్లిష్టంగా ప్యారడైజ్-బోయిన్‌పల్లి మార్గం

బేగంపేట్ విమానాశ్రయం సరిహద్దు వెంబడి ప్యారడైజ్ నుండి బోయిన్‌పల్లి వరకు రోడ్డు వంపు చాలా ఎక్కువగా ఉండటం, విమానాశ్రయ అధికారుల ఆంక్షల కారణంగా, హెచ్ఎండిఎ తన ఎలివేటెడ్ మార్గాన్ని కొంతదూరం పాటు భూగర్భ మార్గంగా మార్చుకుంది. ఈ అలైన్‌మెంట్‌ను బేగంపేట విమానాశ్రయం (తాడ్‌బన్/బోయినపల్లి వైపు) రన్‌వే కింద దాదాపు 600మీటర్ల దూరం భూగర్భ సొరంగం ద్వారా తీసుకువెళ్తుంది. హెచ్ఎండిఎ మార్గానికి అనుసంధానంగా రెండు స్థాయిలపైన ఉండే డబుల్ ఎలివేటెడ్ మెట్రో మార్గాన్ని ఈ భూగర్భ సొరంగంలోనికి దింపి, మళ్ళీ రెండు స్థాయిల ఎలివేటెడ్ మార్గంగా పైకి తీసుకురావడం అనేది ఇంజనీరింగ్ నైపుణ్యానికే సవాల్‌గా మారనుంది. మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్‌ల ప్రారంభం స్థానాన్ని జెబిఎస్ వద్ద ఏకీకృతం చేయడం, ఇక్కడ ప్రపంచస్థాయిలో ఒకహబ్‌ను ఏర్పాటు చేయడం, ఈ కారిడార్లు కొంత దూరం వెళ్లిన తర్వాత వాటిని విడదీసి, రెండు మెట్రో కారిడార్లుగా రూపొందించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని తన క్షేత్ర పర్యటనను మెట్రోరైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి నిర్వహించారు.

### భూగర్భంలో అలైన్‌మెంట్ నివారించేలా ప్రణాళిక

విమానాశ్రయం కింద భూగర్భంలో అలైన్‌మెంట్‌ను తీసుకువెళ్లే ఆవశ్యకతను నివారించే విధంగా, ప్రైవేట్ ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ మార్గాల లాభనష్టాలను అంచనా వేయాలని ఎన్‌విఎస్ రెడ్డి అధికారులకు సూచించారు. అలైన్‌మెంట్ వీలైనన్ని ఎక్కువ నివాస కాలనీలకు, వాణిజ్య, వ్యాపార కేంద్రాలకు ప్రయోజనకరంగా ఉండాలని, స్టేషన్ స్థానాల నిర్ధారణ, వాటి సమీపంలో ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ, రక్షణ భూముల లభ్యత, మెరుగైన పార్కింగ్, ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలను గుర్తించాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సూచించినట్టుగా జెబిఎస్ వద్ద ప్రారంభంలో రెండు మెట్రో కారిడార్లను కలపడంతో ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్నారు. దీనివల్ల బేగంపేట్ విమానాశ్రయం దిగువన సొరంగం ద్వారా మెట్రో అలైన్‌మెంట్‌ను తీసుకెళ్లాల్సిన పరిస్థితిని నివారించి, బోయినపల్లి రోడ్ చివరన ఉన్న జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానించవచ్చు అన్నారు. అక్కడ నుండి ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారి సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలను, వయాడక్టును జాతీయ రహదారుల సంస్థ నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌లకు అంతరాయం కలగకుండా నిర్మించవచ్చని అన్నారు. దీనితో మేడ్చల్ జెబిఎస్ ఎంజిబిఎస్ చంద్రాయణగుట్ట విమానాశ్రయ లింక్‌తో దాదాపు 60 కిలోమీటర్ల సుదీర్ఘ మెట్రో కారిడార్ ఏర్పాటు సాధ్యమవుతుందని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు.

జెబిఎస్ శామీర్‌పేట్ మెట్రో అలైన్‌మెంట్ విషయానికొస్తే, సికింద్రాబాద్ క్లబ్ సమీపంలో ఉన్న ప్రస్తుత మొదటి మెట్రో పిల్లర్ నుండి డబుల్ ఎలివేటెడ్ స్ట్రక్చర్‌గా కరీంనగర్ హైవేపై హెచ్ఎండిఎ నిర్మించబోయే ఎలివేటెడ్ కారిడార్‌పై నేరుగా పొడిగించవచ్చని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి వచ్చే వారితో పాటు, సికింద్రాబాద్, నగరంలోని ఉత్తర ప్రాంతాల నివాసితుల రాకపోకలు, ఇతర అవసరాలను తీర్చడానికి జెబిఎస్‌ను ఒక ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌గా అభివృద్ధిచేసే ప్రణాళికలు రూపొందిస్తామని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. ఇందు కోసం జెబిఎస్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి, రక్షణ శాఖకు చెందిన సుమారు 30 ఎకరాల భూమిని సమీకరించవచ్చున్నారు.

క్షేత్ర పర్యటనలో హెచ్ఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్లు బిఎన్ రాజేశ్వర్, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.బాలకృష్ణ, డిప్యూటీ సిఇ (రైల్వేస్) జె.ఎన్.గుప్తాతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి

ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ మాధవి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఓపెన్ స్కూల్ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతి గదులకు హాజరై పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మాధవి సూచించారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని ఎయిడెడ్ జియోన్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల తరగతి గదులను పరిశీలించడంతోపాటు పాఠ్యంశాలు, పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఎలా వ్రాయాలి అనే విషయాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. భవిష్యత్‌లో పై తరగతులు చదడానికి, ఉద్యోగాలు సాధించేందుకు ఓపెన్ స్కూల్ ఉపయోగపడుతుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత విద్యకు దూరమై ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారందరు ఈ ఓపెన్ స్కూల్ విధానం అలవర్చుకొని భవిష్యత్‌ను బంగారు మయం చేసుకునేందుకు కృషిచేయాలని సూచించారు. చదువుపై పట్టుదల ఉన్న వారు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. చదువుకోవడానికి ఉచితంగా పాఠ్య పుస్తకాలను సైతం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కెవి సత్యానారాయణ, పాఠశాల కోఆర్డినేటర్ జి.సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, విక్రమ్, శిరీష, రవీందర్, చెన్నయ్య, మహేందర్‌రెడ్డి, నరసింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయంగా రాణిస్తే అభివృద్ధి

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆర్యవైశ్యులు ఆర్థికంగా, రాజకీయంగా రాణించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో నూతనంగా ఎన్నికైన ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస్ గుప్త తోపాటు సంఘం నేతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలు చేయడంతోపాటు రాజకీయంగా రాణిస్తే సమాజం ఎంతో అభివృద్ధి సాధించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. ఆర్థికంగా భాగానే ఉన్నప్పటికి సమాజంపై అవగాహనకు రాజకీయంగా రాణిస్తే మరింత అభివృద్ధి సాధించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని, సమాజంలో సేవ చేసే వ్యక్తులకు ఇలాంటి పదవులు వస్తేనే అభివృద్ధిలో ముందుకు వెళ్ళేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నేతలు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, రాజశేఖర్, ఎమ్మె సత్యనారాయణ, బుచ్చిగూడెం వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ బచ్చలి నర్సింలు, యుగేందర్, సుదీర్, వీరేశం గుప్తా, దినేష్ సాగర్, రాజు, ఆర్యవైశ్య సంఘం నేతలు యంసాని శ్రీనివాసులు, పెద్ది రాంమోహన్, శశిధర్, దండు రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులను మోసం చేస్తున్న కార్పొరేట్ కంపెనీలు

ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు



**ప్రజాపక్షం/నార్సింగి:** బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్న బడా కన్‌స్ట్రక్షన్ కార్పొరేట్ కంపెనీలు నిర్మాణ రంగంలో ఇతర రాష్ట్రాల నుండి వచ్చి పని చేస్తున్న మై గ్రేడ్ కార్మికులను నిలువునా మోసం చేస్తున్నాయని, ఆ కంపెనీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశాడు. ఆదివారం గండిపేట మండల భవన నిర్మాణ కార్మిక సంఘం మూడవ మహాసభకు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు భవన నిర్మాణ కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించకుండా, మైగ్రేడ్ లేబర్‌కు అతి తక్కువ వేతనాలు ఇచ్చి పని చేయించుకుంటూ వారిని ఆర్థికంగా దోపిడీకి గురి చేస్తున్నారని మండిపడ్డారు. లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు, మంచినీళ్లు టాయిలెట్స్ లేక అడ్డాల దగ్గర కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. లేబర్ అధికారులు తక్షణమే అన్ని లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మహాసభలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మల్లేష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.చందు యాదవ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కన్య గారి నరసింహారెడ్డి, మండల నాయకులు స్వామి, బాబురావు, మహాదేవ్, తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యం లో చేయాల్సిన కర్తవ్యాలను తీర్మానాలను మహాసభ ఆమోదించినట్లు పర్వతాలు తెలిపారు.

## ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి పత్రికలు

'ప్రజాపక్షం' నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డోకూరి ప్రభాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/తలకొండపల్లి :** పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తలని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని ఆదివారం డోకూరి ప్రభాకర్ రెడ్డి గెస్ట్ హౌస్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి 'ప్రజాపక్షం' నూతన సంవత్సర క్యాలెండర్‌ను డోకూరి ప్రభాకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు,ప్రభుత్వానికి అనుసంధానకర్తలన్నారు. నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా 'ప్రజాపక్షం' దినపత్రికకు పత్రిక రంగంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. 'ప్రజాపక్షం' తెలుగు జాతీయ దినపత్రిక గొప్ప ప్రజా ఆదరణ పొందగలిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలు వెలికి తీసి ప్రజలకు అతి దగ్గరగా చేరువయ్యే విధంగా పనిచేయాలని పత్రికలకు డోకూరి ప్రభాకర్ రెడ్డి సూచించారు. ప్రజాపక్షం నూతన సంవత్సర క్యాలెండర్ అత్యంత అద్భుతమైన రీతిలో ప్రచురించారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డితో పాటు ప్రజాపక్షం పత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన వారిలో వేల్జాల్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఎం.ఏ అజీజ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మైనారిటీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి ఆరీఫ్, నాయకులు వద్దే రాజు, పేరుమల్ల రమేష్, ఆంజనేయులు, అస్రఫ్, ప్రజాపక్షం విలేకరి మీసాల మహేష్ తదితరులు ఉన్నారు.

## అనుమతులు ఉన్నా.. నెంబర్ ప్లేట్ లేదు!

కొడంగల్‌లో జోరుగా ఇసుక అక్రమ రవాణా



**ప్రజాపక్షం/కొడంగల్ :** వాహనాలకు నెంబర్ ప్లేటు లేకుండా జోరుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. కొడంగలో అక్రమ ఇసుక రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. బోంరాస్‌పేట మండలంలోని దుప్‌చర్ల, మహంతిపూర్ పెద్ద వాగుల నుంచి, యాలాల్ మండలంలోని కాగ్నా వాగు నుంచి కొంతమంది వ్యాపారస్తులు కొడంగల్‌లో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల పేరిట దొంగ అనుమతులు తీసుకుని అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ ఎక్కడ బడితే అక్కడ విచ్చల విడిగా విక్రయిస్తూ అందిన కాడికి దోచుకుతింటున్నారు. ఒక్క ట్రాక్టర్‌కు నెంబర్ సరిగ్గా ఉండదు. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్‌లను ప్రశ్నిస్తే అధికార రాజకీయ ప్రముఖుల పేర్లు చెప్పి తప్పించుకుంటున్నట్లు పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ట్రాక్టర్‌లను పట్టుకుంటే రాజకీయ నాయకుల పేర్లు చెప్పి పోలీసులనే బురిడి కొట్టిస్తున్నారు. దీనిపై పోలీసులను వివరణ కొరగా కొడంగల్‌కు వచ్చే ప్రతి ట్రాక్టర్‌కు అనుమతులు ఉంటున్నాయన్నారు. అయితే కొన్ని ట్రాక్టర్‌లకు గాని ట్రాలీలకు నెంబర్ ప్లేట్‌లు లేకపోవడంతో ఆయా ట్రాక్టర్ల యజమానులను హెచ్చరిస్తున్నామని తెలిపారు. నెంబర్ ప్లేట్‌లను ఏర్పాటు చేయాలని సూచించనట్లు వారు వెల్లడించారు.

# మహానగరి

## నూతన కమిటీకి ముప్పు అభినందనలు



ప్రజాపక్షం/నాగారం: నాగారం మున్సి పాలిటీ పరిధిలోని 16వ వార్డు రాజ్‌సు ఖ్‌నగర్ కాలనీ ఎన్నికల్లో భారీ మెజా రిటీతో గెలుపొందిన కాంగ్రెస్ ప్యానల్ నూతన కమిటీకి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్షులు దాసు ప్యానెల్‌కు ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్టేషనరీ షాపు ప్రారంభం

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : చింతల్ డివిజన్ చంద్రానగర్ లో రాజేష్ కచ్వ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ మేఘరాజ్ స్టేషనరి షాపును ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు మహమ్మద్ రఫీ, రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, మైనార్టీ నాయకులు మక్సూద్ అలీ, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, సత్యనారాయణ, మహిళా నాయకురాలు మోహరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/దమ్మాయిగూడ : మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మంత్రి, మేడ్చల్ ఎంఎల్ఎ చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం పలు చోట్ల దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో రూ.30లక్షలతో, 13వ వార్డులో రూ.25 లక్షలతో,17వ వార్డులో 13.50 లక్షలతో, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, 8వ వార్డులో 28 లక్షలతో, డ్రైనేజీ పనులు, 4వ వార్డులో 35లక్షలలతో పలు చోట్ల సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా 2వ వార్డు ఆర్‌జికె కాలనీలో రూ.75లక్షలతో కమ్యూనిటీ హాలు పనులకు మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీతగౌడ్‌తో కలసి ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి,కౌన్సిలర్లు నానునాయక్, మంగళపురి వెంకటేష్,సంపనబోలు స్వప్న,తదితరులు పాల్గొన్నారు.

## ఆరు కిలోల గంజాయి స్వాధీనం



ప్రజాపక్షం/చర్లపల్లి : నిషేధిత డ్రగ్స్, గంజాయి అమ్మిన, కొన్నా కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా అబ్కారి అధి కారి నవీన్‌కు మార్ హెచ్చరించారు. జిల్లా అబ్కారి ఉప అధికారి ముకుంద్ రెడ్డి ఆదేశాలతో అబ్కారి సిఐ భారత్ భూషణ్ ఆధ్వర్యంలో ఆదివారం చర్లపల్లి,రాంపల్లిలో దాడులు నిర్వహించి గంజాయి అమ్ముతున్న ఇద్దరిని మధ్య ప్రదేశ్‌కు చెందిన హరికు షావా వద్ద నాలుగు కిలోలు, ఒరిస్సాకు చెందిన బైనాథ్ బిస్వాల్ వద్ద రెండు కిలోల గంజా యిని పట్టుకుని ఘట్‌కేసర్ అబ్కారి స్టేషన్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి వీరి వద్ద రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్ అరెస్టు




ప్రజాపక్షం/మల్కాజిగిరి : రెండు రోజుల క్రితం గీతానగర్ ప్రాంతంలో మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కొని పరారైన స్నాచర్‌ను నేరేడ్ మెట్ పోలీసులు అరెస్టు చేసారు. వరంగల్ జిల్లా ఎలకుర్తి ప్రాంతానికి చెందిన నిందితుడు మంతుర్తి హరీష్(29) శనివారం రాత్రి ఎస్ఐ చంద్రశేఖర్, క్రైం సిబ్బంది అమ్ముగూడ రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా వెనుక నంబర్ ప్లేట్ లేని బైకుపై తిరుగుతుండగా అదుపులోకి తీసుకొన్నారు. తదుపరి దర్యాప్తులో గత గురువారం గీతానగర్ కాలనీలో మహిళ మెడలోంచి బంగారు గొలుసు స్నాచింగ్ చేసింది తానే అని అంగీకరిచటంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుడు సంచరిస్తున్న బైకు సైతం చోరీ చేసిందేనని పోలీసులు తెలిపారు.

## వైభవంగా గట్టు మైసమ్మ జాతర



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : గట్టు మైసమ్మ జాతర అంగరంగ వై భవంగా జరిగింది. భక్తులు తెల్ల వారు జామునుంచి అమ్మ వారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు గట్టు మైసమ్మ ఆలయ ఈఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటి కుల సంఘాల పెద్దలు జాతరను ఎటువంటి సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలను తీసుకున్నారు. గట్టు మైసమ్మ జాతర ఘట్టాల్లో ప్రధానమైంది భవిష్యవాణి భక్తులకు వినిపించారు. తనను కొలిచేవారికి కొంగు బంగారమవుతానన్నారు. పోతారాజు విన్యా సాలు ,శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. గట్టు మైసమ్మ అమ్మవారిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపి ఈటల రాజేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## మంచి నీటి సమస్యకు పరిష్కారం



ప్రజాపక్షం/మల్కాజిగిరి : మంచి నీటి సమస్య పరి ష్కారానికి గాను జలమండలి అధికారులు జోహార్‌నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వాల్వ్‌ను ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. గత కొద్ది రోజు లుగా ఈ ప్రాంతంలో సరైన ప్రె షర్‌తో మంచి నీరు రాక పోవటం వల్ల తమకు సరి పడే విధంగా మంచి నీరు రావటం లేదని బస్తీవాసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోహార్ నగర్ సొసైటీ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి జాన్, ఉపాధ్యక్షుడు కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సెప్టిక్ ట్యాంక్‌ను తలపిస్తున్న గండిమైసమ్మ స్టేడియం

### అవస్థలు పడుతున్న క్రీడాకారులు, స్థానిక ప్రజలు



ప్రజాపక్షం/దుండిగల్ : హెచ్ఎండిఎ, మున్సిపల్ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. డబల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో సెప్టిక్ ట్యాంక్ లేకపోవడంతో గండిమైసమ్మలోని జ్యోతిరావు పూలే స్టేడియం పరిసరాలు డ్రైనేజీతో నిండి దుర్వాసన వేదజల్లుతూ అధ్వాన్నంగా మారాయి. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్మించిన డబల్ బెడ్ రూమ్స్ ఇళ్లల్లో కనీస వసతులు లేక లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పేద ప్రజల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణాన్ని అప్పటి ప్రభుత్వాలు హెచ్ఎండీఏ అధికారులకు అప్పగించారు. డబుల్ బెడ్ రూమ్స్ ఇళ్ల సముదాయాన్ని నిర్మించిన హెచ్ఎండీఏ అధికారులు కనీస వసతులైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాల తోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. కనీస వసతులు కల్పించాల్సిన హెచ్ఎండీఏ అధికారులు చేతులు ఎత్తేయడం, సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలం కావడంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాలకులకు పబ్లిసిటీ పై ఉన్న శ్రద్ధ కనీస వసతులు లేకపోవడం ఆందోళన కలిగించే విషయం, డ్రైనేజీ పొంగిపొర్లుతూ స్టేడియం పరిసరాలలో మురికి నీరు ఏరులై పారుతూ దుర్వాసన వేదజల్లుతుండడంతో క్రీడాకారులు, స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సుమారు 6 సంవత్సరాలపాటు ప్రారంభానికి నోచుకోలేదు. 2018 లో సార్వత్రిక ఎన్నికలు రావడం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇళ్లను హడావిడిగా ప్రారంభించి వసతులు గాలికొదలేశారు. ఇళ్ల నిర్మాణాన్ని 15 బ్లాకులుగా విభజించి 1700 ఫ్లాట్స్ నిర్మాణం చేపట్టారు. 2018 లో సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో కనీస వసతులను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించింది. ఇప్పటికే సుమారు 900 ఇళ్లల్లో గృహ ప్రవేశాలు జరిగాయి. సేఫ్టిక్ ట్యాంక్ లేకపోవడంతో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నుండి డ్రైనేజీ జ్యోతిరావు పూలే స్టేడియంలో లోకి ఏరులై పారుతుండడంతో పరిసర ప్రాంతాలు దుర్వాసన వేదజల్లుతూ అగమ్యగోచరంగా మారాయి. డబల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం నుండి పైప్‌లైన్ ద్వారా స్టేడియం వైపు డ్రైనేజీ వదలడంతోనే సమస్య తలెత్తినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## నిఘా నేత్రాలతోనే నేరాలు కట్టడి

### సిసి కెమెరాలు ప్రారంభించిన మలిపెద్ది సుధీర్ రెడ్డి



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : కీలకమైన కేసులను ఛేదించడంలో సిసి కెమెరాలు ఎంతో దోహదపడతాయని మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మల్లి పెద్ది సుధీర్ రెడ్డి తన సొంత నిధులతో 8 సిసి కెమెరాలు దాదాపు 55 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఆదివారం సుధీర్ రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సిసి కెరాల ఏర్పాటు ప్రతి ఒక్క కాలనీలకు రక్షణగా నిలుస్తున్నాయని, దొంగతనాలు జరగకుండా ఉపయోగపడుతున్నాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. నగరంలో అడుగడుగునా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం వలన నేరస్తులకు అమ్మాయిలను వేధించే ఆకతాయిలకు భయం ఏర్పాడుతుందన్నారు. చాలా నేరాలు నిఘానేత్రాల భయంతో కట్టడి అవుతున్నాయని హర్షం వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రా రెడ్డి, మేడిపల్లి సిఐ గోవింద్ రెడ్డి, నాయకులు నత్తికృష్ణా, సబెదా బేగం, బద్దం కుమార్, విజయ్ కుమార్, ప్రభాకర్, బాల్ రాజు, వినోద్ రెడ్డి, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ ఆహార పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు

### జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి




ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ నియోజకవర్గంలోని ధరూర్ మండల, వికారాబాద్ పట్టణంలో పలు బేకిరిలపై జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. జిల్లా టాస్క్ ఫోర్స్ సిఐ అంజనేయులు, ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బేకిరిలో గడువు ముగిసిన, అశుభ్రంగా ఉన్న , సింతటిక్ పుడ్ కలర్స్ కలిపిన బేకర్సి ఐటమ్స్‌లను సిజ్ చేసి కేసులు నమోదు చేశారు. జిల్లాలో ఎక్కడ కూడా ప్రజల ప్రాణాలకు ముప్పు కల్గించే, కల్తీ కెమికల్ కలిపిన అమ్మిన, ప్రొత్సహించిన చర్యలు తీసుకుంటామని, ఎవరైన అను మానంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని టాస్క్ ఫోర్స్ ఇన్‌చార్జి అంజనేయులు, జిల్లా ఎస్‌పి తెలిపారు.

## కూచిపూడి నృత్య కళాకారిణి మౌలికకు సన్మానం



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి యునెస్కో అంతర్జాతీయ నృత్య మండలి సభ్యు రాలు కుమారి మౌళిక బొల్లినాడిని ఆదివారం షాపూర్ నగర్ సిఐటియు కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భారత ప్రజాతంత్ర యు వజన సమైక్యల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ఐద్వా కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు రావుల స్వాతి, సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మ ణ్‌లు పాల్గొని సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సీఐటీయూ, డివైఎఫ్ఐ మహిళా సంఘం వాళ్ళందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ. దేవదానం, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ఆది నాగరాజు, భాష, శ్రీనివాస్, సైదులు, తిమ్మప్ప, స్నేహసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్‌ఆర్ సెంటర్లకు పనికిరాని సామగ్రి తరలింపు

### *కాప్రా, మల్కాజిగిరి జిహెచ్ఎంసి అధికారులు విస్తృత ప్రచారం




ప్రజాపక్షం/కాప్రా/మల్కాజిగిరి : ఇళ్లల్లో పనికి రాకుండా పడి ఉండే సామగ్రిని జిహెచ్ఎంసి ఏర్పాటు చేసిన రీసైకిల్, రీయూస్, రెడ్యూస్ (ట్రిపుల్‌ఆర్) సెంటర్లకు తరలించే ప్రక్రియను కాప్రా, మల్కాజిగిరి సర్కిల్ అధికారులు ముమ్మరం చేసారు. దీని కోసం ఆయా డిప్యూటీ కమిషనర్ల సూచనల మేరకు ఆరోగ్య విభాగ అధికార్లు, పారిశుధ్య విభాగ సిబ్బంది పలు ప్రాంతాల్లో సంచరిస్తూ పరిశుభ్రత ప్రాధాన్యతను వివరిస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో పనికి రాని వస్తువులను తరలిస్తున్నారు. ఆదివారం కాప్రా డివిజన్‌లోని సాయిబాబానగర్,భాస్కరరావు కాలనీ, మాధవపురి, లేక్‌వ్యూ కాలనీ, సాయిబాబా ఆఫీసర్స్ కాలనీ ప్రాంతాల్లో శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎస్ఎఫ్ఎలు సంజీవ, వసంత, ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఏ అంజలిలు, మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని రాఖ్ హిల్స్ కాలనీలో మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీత, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌లు అవగాహనా కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఇళ్లల్లో కానీ వ్యాపారస్థలాల నుండి కానీ ప్రతి రోజు వచ్చే చెత్తను తడి పొడిగా వేర్వేరుగా చేసి తమ వద్దకు ఉదయాన్నే చెత్తను తీసుకొనేందుకు వచ్చే స్వచ్ఛ భారత్ ఆటో కార్మికులకు మాత్రమే ఇవ్వాలే తప్ప ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని కోరారు. ప్రతి రోజు బయట పడేసే ప్లాస్టిక్ బాటిల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, న్యూస్ పేపర్లు, పాత బట్టలు, పుస్తకాలు లాంటి అనేక వస్తువులను తిరిగి ఉపయోగించేందుకు రీసైకిల్, రీయూస్, రెడ్యూస్ (ట్రిపుల్ ఆర్ ) ప్రక్రియ కోసం మల్లాపూర్, నేరేడ్‌మెట్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ట్రిపుల్‌ఆర్ సెంటర్లను ఏర్పాటు చేసామని తెలిపారు. ఇలాంటి వస్తువులను పౌరులందరూ తమ బాధ్యతగా గుర్తించి జిహెచ్ఎంసి నుండి వచ్చే స్వచ్ఛ ఆటో సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కోరారు.

## 20లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్, పూడూర్ మండలాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను తనిఖీ చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత ,రేషన్ కార్డులు అర్హులైన వారికి లబ్ది చేకుర్చేలేందుకు వీలుగా అధికారులు క్షేత్రస్థాయిలో అదివారం మున్సిపల్ పరిధిలోని ధన్నారం , పూడుర్‌లో సర్వే బృందలు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. 21నుండి 24వరకు ఎంపిడిఒలు ,తహాసీల్దార్లు ,మండల స్పెషల్ అఫీసర్లు పర్యవేక్షణలో నిర్వహించనున్న గ్రామ సభలలో వాటిని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాసీల్దార్ లక్ష్మి నారయణ ,ఆర్ఐ సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ రేషన్ కార్డులు ,గ్రామ సభల్లో నూ దరఖాస్తు చేసుకోవాలి:

జిల్లా వ్యాప్తంగా అర్హత ఉన్న వారందరికీ రేషన్‌కార్డు అందజేస్తామని రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గ్రామ సభల్లో ,వార్డుల్లో ,ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించిన వాటని పరిశీలించాలని , అర్హులరేషన్ కార్డులు జారీ చేస్తామని అయాన పేర్కొన్నారు.

## ఆదమరిస్తే అంతే సంగతి

### - ప్రమాదకరంగా రోడ్డు విస్తరణ పనులు



ప్రజాపక్షం / కొడంగల్: అదమరిస్తే చాలు అంతేగతి ఎవ్వరు ఎవ్వరికి బాధ్యులు కారు అనే సంగతి ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలి. కొడంగల్ మహబుబ్‌నగర్ ప్రదాన రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. కానీ కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు పక్కన రోడ్డును తవ్వివేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. కొడంగల్ నుంచి కోస్గి వెళ్లే దారిలో హస్నాబాద్ గ్రామ శివారులోని ప్రదాన రహదారికి ఆనుకొని కాల్వర్టులు నిర్మించేందుకు ఎలాంటి సూచిక బోర్డులు లేకుండా ఇలా అడ్డదిడ్డంగా రోడ్డును తవ్వివేశారు. దాదాపు నెల రోజులు కావస్తున్న ఏ ఒక్కరు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు పనులు దాదాపుగా పూర్తి కావడంతో వాహనాలు అతివేగంతో రాకపోకలు సాగిస్తుంటారు. చిన్న తప్పిదం వల్ల ప్రమాదం జరిగితే దీనికి ఎవ్వరు బాధ్యులు అంటు పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైన కాంట్రాక్టర్‌లు, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి సూచిక బోర్డులు అయిన లేకపోతే పనులు పూర్తి చేయాలని ఆరోపణాలు చేస్తున్నారు.

## ముదిరాజ్‌లను బిసిడి నుండి బిసి ఎకి మార్చడమే చిరకాల స్వప్నం

### కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్




ప్రజాపక్షం/నిజాంపేట్ : ముదిరాజ్‌ల చిరకాల సమస్య బిసి డి నుండి బిసి ఎకి మార్చడమేనని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో అఖిల భారత కోలి ముదిరాజ్ జాతీయ ముదిరాజ్ మహాసభ ఎగ్జిక్యూటివ్ సమావేశం నగరంలోని మాదాపూర్‌లోని కావూరి హిల్స్ ఓహోటల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ జాతీయ అధ్యక్షులు, గుజరాత్ రాష్ట్ర మాజీ మంత్రి కున్వర్జీ భాయ్ బవాలియా జీ, ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్‌లు హాజరై మాట్లాడారు.

## చెత్తతో నిండిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



ప్రజాపక్షం/మల్కాజిగిరి : పారిశుద్ధ్య పరిరక్షణ కోసం ఓ పక్క స్వచ్ఛ భారత్ పేరిట ఉద్యమ రూపంలో ముందుకు వెళుతుండగా మరో పక్క ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యం కారణంగా మల్కాజిగిరిలోని ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చెత్తచెదారంతో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. నిత్యం రిజిస్ట్రేషన్ల కోసం వందలాది మంది సంచరించే ఈ కార్యాలయ ప్రాంగణంలో ఎక్కడా చెత్త డబ్బాను ఏర్పాటు చేయక పోవటంతో ఇక్కడికి వచ్చే వా రికి టీ సరఫరా చేసే వ్యాపారస్తులు తెచ్చే టీ తాగి ప్లాస్టిక్ గ్లాసులను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. దీనికి తోడు గుట్కాలు, పాన్‌లుతిని గోడలపై ఉమ్మేస్తుం డటంతోఇక్కడి వాతావరణం అపరిశుభ్రతకు మారు పేరుగా తయారైంది. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ దృష్టికి తీసుకొని వెళ్లగా తమ వద్ద పని చేసే పారిశుద్ధ్య పనులు చేసే కాంట్రాక్టు సిబ్బంది ఊరికి వెళ్లిన కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని చెప్పారే తప్పా ఎలాంటి పరిష్కార దిశగా వెళ్లక పోవటం గమనార్హం.

## అమ్మవారి సేవలో ప్రజలంతా పాల్గొనాలి: ఎమ్మెల్యే కెపి



ప్రజాపక్షం/ నిజాంపేట్ : శ్రీ చిత్తారమ్మ దేవీ అమ్మ వారి సేవలో ప్రజలంతా పాల్గొనాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలోని శ్రీ చిత్తారమ్మ దేవీ జాతర వేడు కలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారికి భక్తులు తొట్టెల ఊరేగింపు, పోతురాజుల ఆటలు, మేకపోతులు, కోడి పుంజుల బలి తదితర కార్యక్రమాలతో ప్రజలు మొక్కులను తీర్చుకున్నారు. ఈ జాతర ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డిలు వేర్వేరుగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

